క్లుప్తంగా

పేదలకు పండ్లు పంపిణీ



పిల్లలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పనిచేస్తున్నారని ఐఎన్టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పేద పిల్లలకు పండ్లు, బ్రెడ్లు, దుస్తులు పంపిణీ చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ జన్మదిన వేడుకలకు కేఎల్లార్ దూరంగా ఉన్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, నాయకులు కృష్ణ, గణేష్, రోహిత్, శ్రీధర్, శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలు అందిస్తున్న ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, సిబ్బంది

కందుకూరు: ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో మంచి మార్కులు సాధించిన మండల పరిధిలోని నేదునూరు మోడల్ కళాశాల విద్యార్థులను బుధవారం ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ముస్కాన్, జి.రమ్యశ్రీ, జి.పూజిత, పి.తేజస్విని, జె.రమ్య, బి.నవ్య, ఏ.అశ్విని, ఎ.సందీప్, ఏ.అక్షిత, కె.శివనందిని, ఎం.సింధూజ, బి.కావ్య, ఇష్రత్, కె.దివ్య, ఎస్.ఝాన్సీ, జె.దివ్య, ఎండీ ఆసీస్‌బేగం తదితరులను సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో కూడా ఇదే తరహా ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

షాద్‌నగర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో సత్తాచాటిన పట్టణానికి చెందిన యువతి ఇంద్రార్చితను నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఇంద్రార్చిత ఇంటికి మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు వెళ్లి ఆమెకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పట్టుదలతో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై ఆమెను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, శ్రీకాంత్‌గౌడ్, ప్రశాంత్, వాసిమ్, రఘు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

షాద్‌నగర్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థినులకు ఎంపీసీ, ఎంజెడ్సీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులు డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఈ సదవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9703441345, 8464006525 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు సమాజానికి ఉపయోగపడినప్పుడే వారికి గుర్తింపు లభిస్తుందని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ పరిధిలోని యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో సాయిలక్ష్మి పల్లా పీహెచ్‌డీ పట్టా పొందారు. పీహెచ్‌డీలో డిజైన్ సింథసిస్ అండ్ పాసిబుల్ బయోలజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నోవెల్ 1.4 బెంజోకన్‌జంక్షన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు గాను ఆమెకు పీహెచ్‌డీ లభించింది. ప్రొఫెసర్ పులిగుల్ల శంకరయ్య పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. యూనివర్సిటీ ఛాన్స్‌లర్ పురుషోత్తంరెడ్డి చేతుల మీదుగా ఆమెకు బుధవారం పట్టా అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ డైరెక్టర్ సువర్ణదేవి, అడ్మినిస్ట్రేషన్ అధికారి సాత్వికారెడ్డి, వైస్ ఛాన్స్‌లర్ శంకర్ లింగం, రిజిస్ట్రార్ రవీందర్, రీసెర్చ్ డీన్ ఆచార్య కిష్టఫర్, రాజేందర్‌రెడ్డి, జగదీశ్‌కుమార్, శంకరయ్య, కుమారస్వామి, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: గురుకులం నుంచి తల్లిదండ్రులతో ఇంటికి బయలుదేరిన విద్యార్థినులు



కందుకూరు: గూడూరు గేట్.. సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో సరదాగా విద్యార్థినులు

సాక్షి ప్రత్యేకం

బడికి బైబై..

- ఇంటిబాట పట్టిన విద్యార్థులు
- విద్యాసంస్థలకు సెలవు



కందుకూరు: కూడలిలో కల్వకుర్తి వెళ్లడానికి ఎండలో నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు, బాలబాలికలు (ఇన్‌సెట్లో) ఆర్టీసీ బస్సును ఆపి వారిని ఎక్కిస్తున్న కానిస్టేబుల్



కందుకూరు: గడిచిన విద్యాసంవత్సరంలో పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు ఇంటి బాట పట్టారు. వార్షిక పరీక్షలు ముగిసి, ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించింది. దీంతో గురుకులాలు, కస్తూర్బాగాంధీ పాఠశాలలకు తమ పిల్లలను తీసుకువెళ్లేందుకు వారి తల్లిదండ్రులు రావడంతో సందడి నెలకొంది. చిన్నారులు ప్రొగ్రెస్ రిపోర్టులు చేత పట్టుకొని ఉత్సాహంతో తోటి స్నేహితులతో సరదాగా కాసేపు గడిపారు. మళ్లీ కలుద్దామంటూ వీడ్కోలు పలికారు. తమవారితో వారివారి గమ్యస్థానాలకు వెళ్లారు.

బస్సుల తిప్పలు

విద్యా సంస్థలకు సెలవులు రావడంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులకు బస్సుల కోసం నిరీక్షణ తప్పలేదు. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి, ఆమనగల్లు వైపు వెళ్లే సర్వీసుల కోసం చిన్నారులు, సామగ్రితో గంటల తరబడి ఎండలో నిల్చోవాల్సిన దుస్థితి కలిగింది. మహిళలు, విద్యార్థులు ట్రంక్ పెట్టెలతో ఉండటం, ఫ్రీ ప్రయాణం కావడంతో ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను ఆపకుండా పోవడం వారికి కొంత ఆందోళన కలిగించింది. విషయం తెలుసుకున్న ఓ కానిస్టేబుల్ బస్సులను ఆపి వారందరిని పంపించేలా చొరవ తీసుకున్నారు.

ఉగ్రవాద సంస్థలను ఏరివేయాలి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలను ఏరివేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరులు పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి హత్యమార్చడం బాధాకరమన్నారు. కాశ్మీరులోని ఉగ్రవాదులను ఏరివేసేందుకు కేంద్రం తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. దేశంలో మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. దేశంలో సమానత్వం, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తున్న నేపథ్యంలో ఇది జీర్ణించుకోలేక కొందరు ఉగ్రవాదులు కుట్ర పన్నారని ఆరోపించారు. పర్యాటకులపై దాడులకు పాల్పడటం పిరికి పందల చర్య అన్నారు. ఎవరూ ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరన్నారు. అందరు కలిసి కట్టుగా ఉండి ఐక్యతను చాటి ఉగ్రవాదాన్ని అంతమొందించాలన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మారణ హోమం దారుణం

షాద్‌నగర్: జమ్మూ కాశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదులు జరిపిన మారణ హోమం అత్యంత దారుణమని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) క్షేత్ర ప్రముఖ్ బండారి రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలను వదిలిపెట్టి హిందువులను మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఉగ్రదాడులకు తెగబడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. దేశంలోని ప్రజలకు రక్షణ లేకుండా చేస్తున్న ఇలాంటి ఉగ్రవాదులను ప్రభుత్వం కూకటి వేళ్లతో అణిచివేయాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి దారుణాలు చోటుచేసుకోకుండా ఉండాలంటే హిందులంతా ఏకతాటిపైకి వచ్చి మతోన్మాదులను ఎదురించాలన్నారు. మారణ హోమం సృష్టించిన ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఉగ్రదాడి బాధాకరం

జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి బాధాకరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదు రోజుల క్రితం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన ప్రకటన చూస్తే భారతదేశాన్ని ఏవిధంగా అస్థిరపరచాలనే కుట్రకోణం కనబడుతుందని తెలిపారు. హిందువులు, ముస్లింలు కలిసి ఉండలేరని పాకిస్థాన్‌లో చేసిన వ్యాఖ్యలను కాశ్మీర్‌లో ఉగ్రదాడుల ద్వారా టెరరిస్టులు రుజువు చేస్తున్నారని వివరించారు. ఇలాంటి దాడులను దేశంలోని హిందువులందరూ ఐకమత్యంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఉగ్రవాదుల్లారా ఖబర్దార్

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక ప్రజలపై ఉగ్రదాడి జరిపిన పాకిస్థాన్ ఉగ్రవాదుల్లారా ఖబర్దార్ అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యతో కాశ్మీర్‌లో భయానక పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని సైనిక దుస్తుల్లో వచ్చిన దుండగులు ఈ దాడికి తెగబడ్డారన్నారు. కాశ్మీర్ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ప్రమేయం ఉందన్నారు. భారత్ శాంతిని కోరుకుంటుంటే పాకిస్థాన్ ఉగ్రదాడులను ప్రేరేపిస్తుందని ఆరోపించారు. ఇలాంటి దాడులను కేంద్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెబుతుందని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిపిన దాడి బాధాకరమన్నారు.

దాడి పిరికిపంద చర్య

షాద్‌నగర్: టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికి పందల చర్య అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడం బాధాకరమన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు, దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఉగ్రవాదులు కుట్రపన్నారన్నారు. పార్టీలకతీతంగా అందరూ ఉగ్రదాడిని ఖండించాలని కోరారు. నిరాయుధులైన సామాన్యులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన టూరిస్టులకు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశంలో అశాంతిని నెలకొల్పేందుకు కుట్రలు చేయడం సరికాదన్నారు. దేశంలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కేంద్రం కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ కమిషనర్, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపాలిటీతో పాటు పట్టణ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం నూతనంగా కొనుగోలు చేసిన రోడ్లు శుభ్రం చేసే యంత్రం, డోజర్ వాహనాలను మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలో రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసేందుకు సహకరిస్తానని, అధికారులు ఆ దిశగా పనిచేయాలని సూచించారు. వేసవిలో ఎక్కడ తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకులు జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, నియోజకవర్గ నాయకుడు వసంతం, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ అధికారులు రాఘువేందర్, రమేశ్, సిబ్బంది, నాయకులు తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, రుత్వీకరణం, మంటపారాధన, పతాకావిష్కరణ, అభిషేకం, భగవద్గీత పారాయణం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మే డేను విజయవంతం చేయాలి

చేవెళ్ల: మే 1 తేదీన నిర్వహించనున్న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్లలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

షాబాద్: తమ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి రబియా సుల్తానాను దైవాలగూడ గ్రామస్తులు కోరారు. బుధవారం మండల పరిధిలోని దైవాలగూడ గ్రామంలో నాగర్‌కుంట పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు వినతిప్రతం అందజేశారు. గ్రామంలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజ్, అంగన్‌వాడీ భవనం, రేషన్ సరుకులు అందేవిధంగా చూడాలని విన్నవించారు. రేషన్ సరుకుల కోసం కిలో మీటర్ దూరం నడుచుకుంటూ వెళ్తున్నామని, దీంతో ప్రజలకు ఇబ్బంది మారిందని ఆరోపించారు. రోడ్లు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్‌లో బుధవారం కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణానికి తనవంతుగా ఎమ్మెల్యే రూ.1లక్ష విరాళం అందజేశారు.



పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

పశువైద్యాధికారి అహ్మద్



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

మొయినాబాద్: పాడి పశువుల పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో బుధవారం గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 238 పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో పశువులకు రోగాలు వస్తాయని, వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు ఇప్పించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా వేస్తున్న టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.


ఆదర్శ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న స్థానిక నాయకులు, కళాశాల అధ్యాపకులు

చేవెళ్ల: ఆదర్శ కళాశాలలో చదివే విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా రాణించడం అభినందనీయమని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి అన్నారు. చేవెళ్లలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కళాశాల అధ్యాపక బృందం అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా మెరిట్ విద్యార్థులకు పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి సన్మానించి ప్రోత్సాహకాలు అందజేశారు. ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిన శృతిలయ, టాపర్లుగా నిలిచిన భార్గవి, వర్షిత, గాయత్రిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, నాయకులు సమతారెడ్డి, మద్యల శ్రీనివాస్, మధుసుదన్‌రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.

కళాశాలలో పుస్తకావిష్కరణ



పుస్తక ఆవిష్కరణలో అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేశ్ రచించిన 'భారత దేశ ఆర్థిక అభివృద్ధిలో పాలసీ విధానంలో సవాళ్లు' అనే పుస్తకాన్ని ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అంశాన్ని రచయిత.. పాఠకులకు అర్థమయ్యే విధంగా పరిశోధనాత్మకంగా రాశారని తెలిపారు. ఓపెన్ ఇంటర్, ఎంఏ ఎకనామిక్స్ ఓపెన్ యూనివర్సిటీ పాఠ్యాంశాలను రచించి, విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో రమేశ్ తోడ్పడ్డారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా మరిన్ని ఉత్తమమైన పుస్తకాలను ఆయన రచించాలని ఆకాంక్షించారు.

ఉగ్రవాదులను మట్టుపెట్టాలి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల
- దాడులకు నిరసనగా ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



బడంగ్‌పేట్: ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



హుడాకాంప్లెక్స్: కొవ్వొత్తుల ర్యాలీలో కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

బడంగ్‌పేట్: హిందువులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని, 28 మంది అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకున్నారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. ముష్కరులు దేశంలో అలజడులు, మత కలహాలు సృష్టించేందుకు కుట్ర పన్నారని, వారిని మట్టుబెడతామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. దీనికి నిరసనగా.. బుధవారం బడంగ్‌పేట చౌరస్తాలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, హోంమంత్రి అమీత్ షా ఉగ్రవాదులను ఏరివేసే పనిలో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, గౌర రమాదేవి, పార్టీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వీరకర్ణారెడ్డి, లాలా సందీప్, భాస్కర్, సైదులు, చిత్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలి

హుడాకాంప్లెక్స్: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ డివిజన్‌లో బుధవారం రాత్రి నిరసన కార్యక్రమం చేపట్టారు. దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముష్కరుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ..పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మతం తెలుసుకుని హత మార్చారని, పశ్చిమ బెంగాల్, కశ్మీర్, మహారాష్ట్రలో హిందువులపైనే దాడులు ఎందుకు జరుగుతున్నాయో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు.

పిరికిపంద చర్య



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మహేశ్వరం: పహల్గామ్‌లో పాక్ ఉగ్రవాదులు టూరిస్టులపై జరిపిన దాడి పిరికిపంద చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు టి.యాదిశ్ పేర్కొన్నారు. దాడికి నిరసనగా బుధవారం రాత్రి పార్టీ మహేశ్వరం కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు జాతీయ జెండాలు, బీజేపీ జెండాలు, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి సంతాపం ప్రకటించారు. మహేశ్వరం ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుదర్శన్‌యాదవ్, బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు వనంపల్లి శ్రావణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.